క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్‌: సీజనల్‌ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్‌ అన్నారు. పట్టణంలోని అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఎదుట నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని సూచించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది కృష్ణమూర్తి, సాయి, ఆనంద్‌, సౌందర్య, సిబ్బంది ఉన్నారు.

చోరీకి గురైన ఫోన్లు అందజేత



వర్ని: చోరీకి గురైన ఫోన్లను బాధితులకు అందజేసినట్లు ఎస్సై కృష్ణకుమార్‌ తెలిపారు. మండల కేంద్రంలోని పీఎస్‌లో మోస్రా గ్రామానికి చెందిన ముగ్గురి ఫోన్లు గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దీంతో బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్‌ ద్వారా ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



రుద్రూర్‌: కోటగిరి మండలంలో ఫర్టిలైజర్‌, విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మురికి కాలువల్లో చెత్త వేయొద్దు



ఆర్మూర్‌టౌన్‌: ప్రజలు చెత్తాచెదారాన్ని మురికి కాలువల్లో వేయకుండా ఇంటింటికీ వచ్చే మున్సిపల్‌ సిబ్బందికి అందించాలని రెండో వార్డు కౌన్సిలర్‌ ఖాందేశ్‌ సంగీత అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేపడుతున్న పారిశుధ్య పనులను కౌన్సిలర్‌ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని అన్నారు. మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి



సిరికొండ: విత్తనాలను విక్రయించడంలో డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నిజామాబాద్‌ రూరల్‌ ఏడీఏ ప్రదీప్‌కుమార్‌ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌ ప్రారంభమవుతున్నందున నకిలీ విత్తనాల నిర్మూలన గురించి వివరించారు. విత్తనాలను విక్రయించేటపుడు రైతులవారీగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి రోజు ఆ సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు అందజేయాలని తెలిపారు. దుకాణాల్లో తప్పనిసరిగా స్టాక్‌ బుక్‌, రిజిస్టర్‌లు నిర్వహించాలని ఆదేశించారు. కంపెనీల నుంచి వచ్చిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, విడిగా విత్తనాలను విక్రయించరాదని, ఎవరైనా ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినట్లయితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ హెచ్చరించారు. లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మినట్లయితే మాకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏవో వెంకటేష్‌, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రంలో నిర్మిస్తున్న అమ్మవారి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన శేర్ల మంగలి ప్రశాంత్‌ రూ.10వేల విరాళాన్ని వీడీసీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన దాతకు వీడీసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి విరాళం అందించాలని వారు కోరారు.

భయం.. భయం..

- శిథిలావస్థలో వేల్పూర్‌ పశువుల ఆస్పత్రి
- దశాబ్దాలుగా పాత భవనమే
- ప్రమాదం నీడన విధుల నిర్వహణ



వర్షానికి తడిసి ప్రమాదకరంగా మారిన గోడ



శిథిలావస్థకు చేరిన పశువుల ఆస్పత్రి

వేల్పూర్‌: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో విధులు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది భయపడుతున్నారు. పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారింది. దీంతో పశువైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వం అప్పట్లో మండలానికి ఒక ఆస్పత్రి చొప్పున నిర్మించారు. రాను రాను నాలుగైదు గ్రామాలకు ఒక ఆస్పత్రి చొప్పున నిర్మించారు. మండలంలో వేల్పూర్‌తో పాటు పచ్చలనడ్కుడ, పడగల్‌ గ్రామాల్లో సొంత భవనాలు ఉన్నాయి. అంక్సాపూర్‌లో ఆస్పత్రికి సొంత భవనం లేదు. సుమారు రెండు దశాబ్దాల నుంచి వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, వ్యవసాయ పనులు చేసేవారు తగ్గుతుండడం వల్ల పశుసంపదను కూడా రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. గతంలో ఇంటికి నాలుగైదు గేదెలు, రెండు జతల ఎడ్లు ఉండేవి. కొందరు ఆవులు సైతం పెంచేవారు. వ్యవసాయంలో యంత్రాల వాడకం విపరీతంగా పెరగడం, పశువుల పోషణను భారంగా భావించడంతో పశు సంపద తగ్గుతోంది. దీంతో ప్రభుత్వాలు సైతం పశువుల ఆస్పత్రులను సైతం పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వేల్పూర్‌ ఆస్పత్రి ద్వారా వేల్పూర్‌తో పాటు మోతె, అక్లూర్‌, అమీనాపూర్‌, లక్కోర, వెంకటాపూర్‌, కోమన్‌పల్లి, కుకునూర్‌ గ్రామాల పశువులకు వైద్యసేవలు అందుతాయి. ప్రభుత్వం నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాల ద్వారా గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. పశువులకు ఉచిత దాణా, ఉచిత గడ్డి విత్తనాల స్టాకు వంటివి సరఫరా చేసినప్పుడు ఆస్పత్రిలో నిల్వ చేయాల్సి వస్తోంది. దీంతో వర్షం కురిసినపుడు దాణా, విత్తనాలు తడిసిపోతున్నాయి. అంతేగాక వైద్యులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



వేల్పూర్‌ పశువైద్యశాల నిర్మించి సుమారు నలభైఏళ్లు అవుతోంది. కూలిపోయే దశకు చేరింది. నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. పశువుల వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లినప్పుడు అందులో కూర్చోవాలంటేనే భయమేస్తోంది. అధికారులు వెంటనే నూతన భవనం నిర్మించాలి.

– బద్దం రాజారెడ్డి, రైతు, వేల్పూర్‌

కూలిపోయే ప్రమాదం ఉంది



పశువుల ఆస్పత్రి పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే దశకు చేరింది. ఆస్పత్రి ఎప్పుడు కూలుతుందో తెలియదు. కొత్త భవనానికి నిధులు మంజూరు చేసేంత వరకు ఇతర భవనంలోకి మార్చాలి. లేకుంటే ఆకస్మికంగా కూలిపోయి ప్రాణాపాయం సంభవించే ప్రమాదముంది. అధికారులు స్పందించి భవనాన్ని నిర్మించాలి.

– తీగెల మధుకర్‌, రైతు, వేల్పూర్‌

త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి



తగ్గెల్లి పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



జానకంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి

బోధన్‌/ రెంజల్‌/ ఎడపల్లి/ నవీపేట: పాఠశాలలు పున:ప్రారంభ నేపథ్యంలో చేపడుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బోధన్‌ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాలూర మండలంలోని తగ్గెలి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను పరిశీలించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అధికారులు, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు. రెంజల్‌, నీలా హైస్కూల్‌లను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెంజల్‌ హైస్కూల్‌లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై హెచ్‌ఎం ఆంజనేయులును ఎమ్మెల్యే అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా చర్యలు తీసుకునాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట, ఎమ్మెస్సీ ఫారం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు.

నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులను ఎమ్మె ల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా అమ్మ ఆదర్శ కమిటీ ప్రతినిధులు చూడాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ పండుగ



రుద్రూర్‌: మండలంలోని చిక్కడపల్లిలో బారెడు పోచమ్మ పండుగను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



ఆర్మూర్‌టౌన్‌ : పట్టణంలోని విద్యాహైస్కూల్‌ ఆవరణలో రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు 'అవ్వకు బువ్వ' కార్యక్రమంలో భాగంగా పేదలకు శుక్రవారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేశ్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రతి నెల పేదలకు 5 కిలోల చొప్పున 52 మందికి ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో 18 సభ్యులతో కలిసి సేవా సంస్థను ప్రారంభించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్‌ పవార్‌, ఉపాధ్యక్షుడు జిందం నరహరి, విద్యా గోపికృష్ణ పట్వారి, ఎ శ్రీకాంత్‌, గోనె శ్రీధర్‌, బేతు గంగాధర్‌, ఖాందేశ్‌ సత్యం, తులసి పట్వారి, మీరా శ్రావణ్‌, ఖోడె శ్రీనివాస్‌, బండారి నరేశ్‌, రాజేశ్‌, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

నవీపేట: నవీపేట, కమలాపూర్‌ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం వాటి పరిధిలోని గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవీపేట, అభంగపట్నం, అబ్బాపూర్‌, దర్యాపూర్‌, స్టేషన్‌ ఏరియా, పొతంగల్‌, శ్రీరామ్‌ తండా, కమలాపూర్‌, మహంతం, రెడ్డిఫారం, మోకన్‌పల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని కోరారు.

అక్రమ నిర్మాణాల అనుమతిపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

బాల్కొండ: మండల కేంద్రంలోని జీపీ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇంటి అక్రమ నిర్మాణాల కోసం నాటి జీపీ కార్యదర్శి నర్సయ్య ఇచ్చిన అనుమతులపై డీఎల్‌పీవో శివకృష్ణ శుక్రవారం విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో కమర్షియల్‌ ఇంటి నిర్మాణాలకు అక్రమంగా అనుమతులు ఇచ్చారంటు స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. జీపీలో ఉన్న రికార్డులను పరిశీలించి, ఇచ్చిన అనుమతుల వివరాలను సేకరించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌ రెడ్డి, ఈవో రజినీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాగు నీటి సమస్యను పరిష్కరిస్తాం



నీటి సమస్య ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఈ అనిల్‌

బోధన్‌: సాలూర మండల కేంద్రంలోని 12, 13 వార్డుల్లో కలుషిత తాగు నీరు సరఫరా అవుతుందని కాలనీ వాసులు గురువారం స్థానిక తహసీల్దార్‌ రమేశ్‌కు వినతిపత్రం అందించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్‌ శాఖ స్పందించింది. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్‌ మండల ఏఈ అనిల్‌ కుమార్‌, ఎంఆర్‌ఐ గంగాధర్‌, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌ వార్డుల్లో పర్యటించారు. కలుషిత తాగునీటి సరఫరాకు గల కారణాలు పరిశీలించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

సాధారణ బోగీలను పెంచాలని విన్నపం

నిజామాబాద్‌నాగారం: ప్రతి రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలని ప్రధానమంత్రి దివ్య సన్నిధికి కోటి ఉత్తరాల కార్యక్రమంలో భాగంగా రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్‌ డాక్టర్‌ పరికిపండ్ల అశోక్‌, పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పులగం హన్మాండ్లు ఆధ్వర్యంలో కార్యక్రమాలను ప్రారంభించారు. పద్మశాలి సంఘం జిల్లా పట్టణ నాయకులు మద్దతు తెలిపి ప్రధానమంత్రికి స్వయంగా వంద ఉత్తరాలు రాశారు. సాధన సమితి జాతీయ కన్వీనర్‌ డాక్టర్‌ పరికిపండ్ల అశోక్‌ మాట్లాడుతూ.. ఐదు సాధారణ బోగీల సాధన కోసం ప్రధాన మంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాలను పంపుతూ గాంధీ మార్గంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అనధికార అంచనా ఉండగా, ఈ ప్రయాణంలో జనరల్‌ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఉందని, సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ, ఇటీవలనే గుజరాత్‌ రాష్ట్రానికి వెళ్లి, అక్కడ కూడా పలు జిల్లాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ఆంధ్రప్రదేశ్‌లోని 14 జిల్లాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ పోస్ట్‌ కార్డు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సీనియర్‌ అడ్వకేట్‌ బసవ రాజేశ్వరరావు, గుజ్జేటి వెంకట నరసయ్య, బింగి మోహన్‌, గెంట్యాల వెంకట నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్‌ సకాలంలో అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ యూనిఫామ్స్‌, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అధికారి మురళీమనోహర కృష్ణకు నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్‌ మాట్లాడుతూ.. గత సంవత్సరం చాలా ప్రభుత్వ పాఠశాలలో కొంతమంది విద్యార్థులకు మాత్రమే యూనిఫాం, పుస్తకాలు అందాయని, పూర్తి స్థాయిలో అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరారు. నగర అధ్యక్షులు గణేష్‌, నాయకులు వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ కోతలపై గరం గరం

- వేళాపాల లేని విద్యుత్‌ కోతలపై సభ్యుల నిలదీత



అధికారులను నిలదీస్తున్న కో ఆప్షన్‌ మెంబర్‌

కమ్మర్‌పల్లి: విద్యుత్‌ కోతలపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు గరం గరం అయ్యారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గౌతమి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. విద్యుత్‌ సరఫరా నిలిపివేతపై ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని, దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌ సరఫరా లోపంతో ఎలక్ట్రానిక పరికరాలు కాలిపోతున్నాయని ఎంపీపీ సమావేశంలో ప్రస్తావించారు. పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టడంతో విద్యుత్‌ సరఫరా నిలిపి వేయాల్సి వస్తోందని విద్యుత్‌ సబ్‌ ఇంజినీర్‌ తెలిపారు. ప్రభుత్వం కోతలు లేని విద్యుత్‌ సరఫరా చేయాలని సూచిస్తుంటే అధికారులు మాత్రం తమ కేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండల కోఆప్షన్‌ మెంబర్‌ అజ్మత్‌ హుస్సేన్‌ మండి పడ్డారు. సమావేశానికి ముందు పనుల పురోగతి నివేదికలను సమర్పించని ఏఈవో సాయిరాం, ఎంపీవో సదాశివ్‌, పీఆర్‌ ఏఈ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మూడు శాఖల అధికారులు ఎజెండా కాపీలు సమర్పించకపోవడం శోచనీయమని ఎంపీడీవో రాజశ్రీనివాస్‌ పేర్కొన్నారు. వైస్‌ ఎంపీపీ శేఖర్‌, తహసీల్దార్‌ ఆంజనేయులు, మండల పరిషత్‌ సూపరింటెండెంట్‌ గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

సొంత ప్రాసెసింగ్‌ యూనిట్‌తో లాభాలు

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



బాదాం తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్‌: అమెరికాలో రైతులు తమ పంటకు సొంత ప్రాసెసింగ్‌ యూనిట్‌ను ఏర్పాటు చేసుకొని లాభాలు పొందుతున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కాలిఫోర్నియా రాష్ట్రంలోని రిపాన్‌ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న బాదాం తోటను పరిశీలించి, సాగు విధానం తెలుసుకున్నారు. అక్కడి పంటల సాగును వివరిస్తూ వంద ఎకరాలలో ఆధునిక టెక్నాలజీ, బిందు సేద్యంతో బాదాం తోటను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కెనాల్‌ ద్వారా అందిస్తున్న నీటిని పంప్‌చేసి డ్రిప్‌ పద్ధతిలో తోటలకు నీటిని అందిస్తున్నారని అన్నారు. మన దగ్గర వ్యవసాయ పద్ధతుల్లో కూడా నలుగురైదుగురు రైతులు కలిసి మొక్కజొన్న, ఇతర పంటలకు ప్రాసెసింగ్‌ యూనిట్‌ను అక్కడే ఏర్పాటు చేసుకొని మార్కెటింగ్‌ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు.

అక్బర్‌నగర్‌లో విత్తన మేళా



విత్తనాల రకాలను తెలుసుకుంటున్న రైతులు

రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ శివారులో ఉన్న వరి, చెరుకు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సమీప గ్రామాల రైతులు హాజరై పరిశోధన కేంద్రంలో రూపొందించిన వరి, సోయా చిక్కుడు విత్తనాలను కొనుగోలు చేశారు. నూతన వంగడాల గూర్చి వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్నారు. సీజన్‌ల వారిగా లభించే విత్తనాలు, కాల పరిమితి, దిగుబడి తదితర విషయాలను రైతులకు తెలియజేశారు. అనంతరం వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్‌ బాలాజీ నాయక్‌ మాట్లాడుతూ.. విత్తన మేళా కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని అన్నారు. పరిశోధన కేంద్రంలో రూపొందిస్తున్న వరి వంగడాల గూర్చి రైతులకు తెలియజేశామని వెల్లడించారు.

ఆధ్యాత్మికం..

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



పెర్కిట్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ 31వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఆలయంలో చక్ర స్నానం, ధ్వజారోహనం, పుష్పయాగం, ఏకాంత సేవ, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు సంజీవ రెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, జగన్మోహన్‌ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, పురోహితులు పాల్గొన్నారు.



భారతి సిమెంట్‌కు తిరుగు లేదు

బోధన్‌: సిమెంట్‌ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌ పేరుతో ఫాస్ట్‌ సెట్టింగ్‌ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ మేనేజర్‌ మిర్జా తెలిపారు. పట్టణంలోని రాయల్‌ ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్‌ ఇంజినీర్‌ సాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని అన్నారు. ప్రపంచంలోనే అగ్రగామిగా పేరొందిన జర్మనీ టెక్నాలజీ సహకారంతో భారతి సిమెంట్‌ ఉత్పత్తి అవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు భారతి అల్ట్రాఫాస్ట్‌ సిమెంట్‌ సరైన ఎంపిక అని పేర్కొన్నారు.

భారతి సిమెంట్‌ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందిస్తామని స్లాబ్‌ కాంక్రీట్‌ సమయంలో నిపుణులైన తమ సంస్థ ఇంజినీర్లు సైట్‌ వద్దకు వచ్చి సహాయ పడతారని తెలిపారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను 150 మందికి అందజేశారు. డీలర్‌ జహీర్‌ తదితరులు పాల్గొన్నారు.

అక్బర్‌నగర్‌లో కుస్తీ పోటీలు

రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌లో శుక్రవారం కుస్తీ పోటీలు హోరా హోరీగా సాగాయి. పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించిన అనంతరం కుస్తీ పోటీలు జరుపడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు వెల్లడించారు. పోటీల్లో మల్లయోధులు తలపడ్డారు.